# 46

# విడాకుల ప్రశ్న

## (19:1-12)

మత్తయి సువార్త 19వ మరియు 20వ అధ్యాయము కలిపి యేసు సంచరించుచు చేసిన పరిచర్యను చిత్రీకరించుచున్న ఒక అంశమై యున్నవి. ఆయన తన ప్రయాణమును నెమ్మదిగా యెరూషలేము మరియు సిలువ వైపు సాగించుచు, ఉత్తరమున నున్న గలిలయ ప్రాంతము నుండి దక్షిణమున నున్న పెరియ మరియు యూదయ ప్రాంతముల మధ్య సంచరించుచు పరిచర్య చేయుచుండెను. ఆ యా ప్రాంతములలో యేసు నానావిధ ప్రజా సమూహములను కలిసికొన్నప్పుడు వారి మధ్య పరస్పరము ప్రభావము చూపిన చర్యలను ఈ అధ్యాయములు సవివరంగా వివరించుచున్నవి. సామాన్యంగా, జనసమూహములు ఆయనను అంగీకరించారు.

19వ అధ్యాయమును మూడు ముఖ్య భాగములుగా విభజింపవచ్చును. మొదటి భాగములో, విడాకుల గూర్చి పరిసయ్యులు యేసు నడిగిన ప్రశ్నకు ఆయన సమాధాన మిచ్చిన వివరము కలదు (19:1–12). రెండవ భాగములో, ఆయన చిన్న పిల్లలను తన యొద్దకు ఆహ్వానించి, వారిని ఆశీర్వదించాడు (19:13–15). ఇక చివరి భాగము, సిరిసంపదలకు సంబంధించిన సంభాషణయై యున్నది మరియు అది ఎక్కువగా ధనవంతుడైన యువక అధికారితో చర్చించిన విషయమై యున్నది (19:16–30).

### యేసు పెరియకు పయనించుట (19:1, 2)

**1యేసు ఈ మాటలుచెప్పి చాలించిన తరువాత గలిలయనుండి యొర్దాను అద్దరినున్న యూదయ ప్రాంతములకు వచ్చెను. 2బహు జనసమూహములు ఆయనను వెంబడింపగా, ఆయన వారిని అక్కడ స్వస్థపరచెను.**

**వచనము 1.** ఈ మధ్యంతర పదజాలము మత్తయి వ్రాసిన సువార్తలో ఐదు పర్యాయములు అగుపించుచున్నది: **యేసు ఈ మాటలు చాలించిన తరువాత** (చూడు 7:28; 11:1; 13:53; 26:1). ఇచ్చట, అది ప్రధానంగా యేసు చేసిన నాలుగవ ఉపదేశ సమావేశము ముగియుటను సూచించుచున్నది (18వ అధ్యాయము). ఈ సమయంలో, యేసు తన పునరుత్థానము తదుపరి కలిసికొనుటకు ఏర్పరచుకొనిన ఒక కొండ మీద అగుపించునంత వరకు కడసారిగా **గలిలయను** విడిచివెళ్లాడు (28:16, 17; యోహాను 21:1).

యేసు "పెరియ పరిచర్యను" ప్రారంభించుటకు బయల్దేరాడు, ఈ పరిచర్య 19:1–20:28లో గల వాక్య భాగమంతటిలో వివరింపబడి యున్నది.[1] "పెరియ," (తూర్పున) **యొర్దానుకు ఆవల నున్న యూదయ ప్రాంతమునకు** పెట్టబడినపేరైయుండి, *peran* అను గ్రీకు పదము నుండి తీసికొనబడినది, ఈ పదమునకు "ఆవల," లేక

“అడ్డంగా,” లేక “అవతలి ప్రక్క” అని అర్థము. ఈ ప్రదేశము “యొర్దానుకు అద్దరినున్న” అని (4:25; 19:1; మార్కు 3:8; 10:1; యోహాను 1:28; 3:26; 10:40) యూదయకు సంబంధించిన దృష్టికోణములో వర్ణింపబడుచున్నది. “పెరియ” అను వాస్తవమైన పేరు క్రొత్త నిబంధనలో లేదు కానీ జోసీఫస్ రచనలలో అగుపించుచున్నది.[2] ఈ సరిహద్దు ఉత్తరమున గల యార్ముక్ (*Yarmuk*) నది మొదలుకొని దక్షిణమున అర్నోను వరకు విస్తరించి యున్నది. ఈ ప్రాంతము కొన్ని పర్యాయములు యొర్దానుకు ఆవల నున్న ప్రదేశమని సూచింపబడుచున్నది. ఈనాడు, ఈ సరిహద్దులో గల దేశము (అంత కంటె ఎక్కువే) మామూలుగా జోర్డన్ అని పిలువబడుచున్నది.

మత్తయి సువార్తీకుడు ప్రయోగించుచున్న భాష గూర్చి ఒక ప్రశ్న తలెత్తుచున్నది, ఏలయనగా సాంకేతికపరంగా పెరియ యూదా దేశములో ఒక భాగము కాదు. యొర్దాను నది సామాన్యంగా రెండు సరిహద్దులను విభాగించుచుండిన రేఖయై యుండినది. మార్కు 10:1 యేసు “అక్కడ నుండి లేచి యూదయ ప్రాంతములకును యొర్దాను అద్దరికిని వచ్చెనని” చెప్పుచు ఒక క్లుప్త వివరణను కలుపుచున్నది, ఇది విభజించిన రెండు వేర్వేరు ప్రాంతములను సూచించుచున్నది.

గలిలయ నుండి యెరూషలేమునకు ప్రయాణమై వచ్చుచుండిన యాత్రికులు ఉత్తరమున నున్న యొర్దానును దాటి, తూర్పున పెరియ గుండా పయనించి, ఆ తరువాత దక్షిణమున యూదయ లోనికి ప్రవేశించుచుండిరి. ఇలా చేయడం ద్వారా వారు సమరయుల సరిహద్దును చుట్టివచ్చుచుండిరి, ఏలయనగా సమరయులు వారి బద్ధశత్రువులుగా పరిగణించబడ్డారు. ఈ సమయంలో యేసు ఆ బాటలో పయనించలేదని అగుపించుచున్నది. కాని, ఆ మార్గమునకు బదులుగా, లూకా సువార్తీకుడు చెప్పుచున్నట్లు, ఆయన గలిలయ మరియు సమరయ దేశముల మధ్యగా పయనించి పెరియ దేశములోనికి ప్రవేశించాడని తెలియుచున్నది (లూకా 9:51–56; 13:22; 17:11).

యేసు పెరియ దేశమంతటను సంచరించి ఆ తరువాత యూదయ ప్రాంతమునకు వచ్చాడు. ఆయన యెరికో గుండా పయనించి (20:29), యెరూషలేమునకు చేరుకొన్నాడు (20:17; 21:1, 10). ఈ ప్రాంతములో, యేసు తన పరిచర్యలోని ఉపదేశములు మరియు అద్భుతకార్యములు చేయు భాగమును పూర్తిచేసాడు, ఏలయనగా ఆయన ఇప్పుడు తన ధ్యాస అంతటిని దాదాపుగా ఆసన్నమగుచుండిన ఆయన మరణముపై కేంద్రీకరించుటకు మొదలుపెట్టాడు.

**వచనము 2. బహు జనసమూహములు** యేసును చుట్టుముట్టి యుండిరి. ఆయనకు అదొక అలవాటై యుండినట్లుగానే, ఆయన జనసమూహములపై తన కనికరమును కనుపరచుచు, వారిలో అనారోగ్యముగనుండిన అనేకులను **స్వస్థపర్చాడు** (4:23, 24; 9:35; 14:35, 36; 15:30, 31).

## పరిసయ్యులడిగిన ప్రశ్న (19:3–9)

**3పరిసయ్యులు ఆయనను శోధింపవలెనని ఆయనయొద్దకు వచ్చి – ఏ హేతువుచేతనైనను పురుషుడు తన భార్యను విడనాడుట న్యాయమా? అని అడుగగా 4ఆయన–సృజించిన వాడు ఆదినుండి వారిని పురుషునిగాను స్త్రీనిగాను సృజించెననియు 5–ఇందు నిమిత్తము**

**పురుషుడు తలిదండ్రులను విడిచి తన భార్యను హత్తుకొనును, వారిద్దరును ఏకశరీరముగా ఉందురని చెప్పెననియు మీరు చదువలేదా? [6]కాబట్టి వారికను ఇద్దరుకాక ఏకశరీరముగా ఉన్నారు గనుక దేవుడు జతపరచినవారిని మనుష్యుడు వేరుపరచకూడదని చెప్పెను. [7]అందుకు వారు–ఆలాగైతే పరిత్యాగ పత్రికనిచ్చి ఆమెను విడనాడుమని మోషే యెందుకు ఆజ్ఞాపించెనని వారాయనను అడుగగా [8]ఆయన–మీ హృదయకాఠిన్యమును బట్టి మీ భార్యలను విడనాడ మోషే సెలవిచ్చెను, గాని ఆదినుండి ఆలాగు జరుగలేదు. [9]మరియు వ్యభిచారము నిమిత్తమే తప్ప తన భార్యను విడనాడి మరియొకతెను పెండ్లిచేసికొనువాడు వ్యభిచారము చేయుచున్నాడనియు, విడనాడబడిన దానిని పెండ్లి చేసికొనువాడు వ్యభిచారము చేయుచున్నాడనియు, మీతో చెప్పుచున్నానని వారితో ననెను.**

వారి మనస్సులకు నెమ్మదిలేకుండా చేయుచు వారికి ఇబ్బంది కలుగజేయుచుండిన అంశము, అనగా పురుషులు విడాకులు ఇచ్చి పునఃర్వివాహము చేసికొనుట, ఇచ్చట యేసుకు నివేదింపబడినది. ఈ రోజుల్లో ఉన్నట్టుగానే, క్రీస్తు కాలములో వారికి అదొక గంభీరమైన సమస్యయై యుండినదని ఈ వాక్యభాగము వెల్లడించుచున్నది. విడాకుల విషయము ఎంత చులకనయైన అంశమయ్యిందంటే, అన్నం కొంచెము మాడిపోయినా, కూరలో ఉప్పు కొంచెం ఎక్కువైనా, మొదలగు ప్రతి చిన్న విషయానికి పురుషులు వారి భార్యలకు విడాకులిచ్చుటకు సిద్ధపడుచుండిరి లేదా వారిని బహిరంగముగా అవమానపర్చుచుండిరి.

వారడిగిన ప్రశ్నకు యేసు ఇచ్చిన సమాధానమును మనము బహు జాగ్రత్తగా పరిశీలించి అధ్యయనము చేసినట్లయితే, ఆయన విడాకుల విధానాన్ని సమర్థించలేదని విదితమౌతుంది, సరికదా ఆయన నిశ్చయముగా దానిని ఆజ్ఞాపించలేదు. దానికి మారుగా, ఆయన విడాకుల వలన కలుగు విషమ పరిస్థితులను వారికి విశదముగా వివరించుచు, అది వ్యభిచారమునకును అపవిత్రతకును ఎలా దారి తీస్తుందో కూడ వారికి తెలియజెప్పాడు.

దేవుడు అసమ్మతితో అనుమతించిన విషయము ఇప్పుడు దైవికమైన పిడివాదముగా మారినది. మోషే ద్వారా, దేవుడు విడాకులకు గుర్తింపునిచ్చాడు మరియు దానిని అనుమతించాడు; కానీ ఇది దేవుని అసలు ఉద్దేశము కాదని యేసు బోధించాడు. ఆయన విడాకులను విచ్చలవిడి చేయలేదు; వాస్తవమునకు ఆయన దానిని నియంత్రించాడు. వాస్తవమునకు, అమలు చేయబడుటకు అది మరి ఎక్కువ కష్టమైనదై యుండునట్లు చూసాడు. దేవుడు వైవాహిక సంబంధములో నెలకొని యుండవలెనని అనాదిగా సంకల్పించిన సదుద్దేశపూర్వక పవిత్రతను పునఃరుద్ధరించుటకు యేసు ప్రయత్నించాడు.

**వచనము 3**. పెరియ హేరోదు అంతిపయ పరిపాలించుచుండిన ఒక భూభాగమై యుండినది. జోసీఫస్ చెప్పుచున్నదాని ప్రకారము, బాప్తిస్మమిచ్చు యోహాను చెరలో బంధింపబడి చివరకు తలనరకబడిన స్థలము పెరియ యని తెలియుచున్నది. ఈ ప్రవక్త హేరోదు యొక్క వావివరసల్లేని లైంగిక సంబంధమును తీవ్రముగా ఖండించినందువలననే ఈ అన్యాయమునకు గురయ్యాడు. తన సహోదరుడు, మొదటి హేరోదు ఫిలిప్పు యొక్క సహధర్మచారిణియై యుండిన హేరోదియను పరిణయమాడగలుగునట్లు హేరోదు నెబాతు వంశీయురాలై యుండిన తన భార్యకు విడాకులిచ్చాడు (14:3, 4పై గల వ్యాఖ్యానమును చూడు). ఈ ప్రాంతములో ఈ అంశము అత్యధికంగా చర్చింపబడుచుండిన విషయమై

యుండినదనియు, గనుకనే **పరిసయ్యులు** విడాకుల గూర్చి **యేసును** ప్రశ్నించుటకు యిది హేతువయ్యిందనియు ఈ చారిత్రాత్మక నేపథ్యము సూచించుచున్నది. బహుశా, ఈ వివరణమును తెలిసికొనిన తరువాత యేసు హేరోదు మరియు హేరోదియ విషయంలో హేరోదుతో ఘర్షణ పడుననియు, తత్ఫలితంగా బాప్తిస్మమిచ్చు యోహానుకు పట్టిన గతియే యేసుకు కూడ పట్టవలెననియు వారు ప్రయత్నించుచుండి యుండవచ్చును.

**ఏ హేతువుచేతనైనను పురుషుడు తన భార్యను విడనాడుట న్యాయమా?** అని పరిసయ్యులు యేసును ప్రశ్నించారు. యూదా మతములో విడాకులు పురుషుల యొక్క విశిష్టాధికారమై యుండినది.[3] కొన్ని పరిస్థితులలో, ఒక స్త్రీ తన భర్త ఆమెను విడనాడునట్లు ఆమె న్యాయస్థానము ద్వారా తన భర్తపై ఒత్తిడి కలుగజేయగలుగుచుండిరి.[4] హేరోదు కుటుంబమునకు సంబంధించి యుండిన కొందరు స్త్రీలు వారి భర్తలకు విడాకులిచ్చియుండిరి, కానీ యూదులలో అత్యధిక సంఖ్యాకులు ఈ విషయమును ఒక దురాగతముగా పరిగణించుచుండిరి. ఇటువంటి ఒక సందర్భము గూర్చి జోసీఫస్ ఇలా వ్రాయుచున్నాడు,

> సలోమె [మహా హేరోదు రాజు సహోదరి] కోస్తొబారస్‌తో జగడమాడినప్పుడు, ఆమె అతనికి విడాకుల నోటీసు జారీచేసి, అతనితో ఉండిన వైవాహిక సంబంధమును రద్దుచేసికొన్నది, కానీ ఈ విధానము యూదుల చట్టముల ప్రకారమైన పద్ధతి కాదు; ఏలయనగా మన విషయంలోనైతే భర్త తన భార్యకు విడాకులిచ్చుట న్యాయ సమ్మతమే, భార్య తన భర్త కిచ్చుటకాదు కానీ ఒక భార్య, తన భర్తను విడనాడి వెళ్లిపోయినట్లయితే, తన మొదటి భర్త ఆమెను విడనాడితేనే తప్ప, తనంతట తానుగా మరొక పురుషుని పరిణయమాడజాలదు.[5]

"మా దేశ చట్టములను భంగపరచి, తన భర్త యింకా బ్రతికి యుండగా అతని నుండి ఆమెయే విడాకులు తీసికొను బాధ్యత వహించుటకు హేరోదియ సాహసించి, అటుతరువాత ఆమె హేరోదు [అంతిపయను] అతని తండ్రి తరుపున తన భర్త యొక్క సహోదరుడు వివాహమాడినదని" ఆయన అటుతరువాత రచించాడు.[6] సంపన్న వర్గమునకు చెందినవారై యుండిన ఈ స్త్రీలు గ్రీకు మరియు రోమా దేశముల సంస్కృతి చేత ప్రభావితులయ్యారు, ఆ సంస్కృతి ప్రకారం స్త్రీలు వారి భర్తలకు విడాకులిచ్చుట అతిగా ఆమోదింపబడిన అంశమై యుండినది (చూడు 1 కొరింథీయులకు 7:12, 13).

మత్తయి వ్రాయుచున్న వివరము, "ఏ హేతువుచేతనైనను" అను పదజాలముతో ప్రశ్నను వర్ణణాత్మకము చేయుచున్నది (చూడు మార్కు 10:2). మత్తయి తన సువార్తను వ్రాయుచున్న యూదా మత పాఠకులు ఆ రోజుల్లో యెరూషములో జరుగుచుండిన చర్చోపచర్చలతో సుపరిచితులై యుందురు. పరిసయ్యులు *కేవలము* "విడాకులిచ్చుట అనుమతింపబడినదా" అని అడుగలేదు, ఏలయనగా విడాకులిచ్చుట అనుమతింపబడినదని దాదాపుగా ప్రతి యూదుడు ఎరిగియుండెను. అలా కాకుండా, వారు విడాకులిచ్చుటకు గల *ఆధారము* గూర్చి ఆయనను అడుగుచుండిరి. "ఏ హేతువుచేతనైనను" అనంటే, "అది ఒక భర్త పేర్కొనగల తన కిష్టము వచ్చిన ఏ హేతువైనను అయియుండవచ్చునని" అర్థము. ఒక భర్త తన భార్యకు "ఏ హేతువుచేతనైనను" విడాకుల ధ్రువపత్రము నియ్యవచ్చుననియు, "ఇటువంటి సందర్భములు పురుషులలో అనేకము ఏర్పడుచుండినవనియు" జోసీఫస్ చెప్పుచున్నాడు.[7]

కొంత మంది యూదా మత బోధకుల చేత సమర్థవంతముగా ప్రోత్సాహింపబడుచుండిన విడాకుల గూర్చిన విశాల దృక్పథము ద్వితీయోపదేశకాండము 24:1–4లలో గల మోషే బోధను గూర్చిన తప్పుడు అనువాదముపై ఆధారపడి యుండినది. యేసు రోజుల్లో, విడాకులకు సరైన హేతువులేమిటో యని రెండు ప్రధాన అభిప్రాయ మతములు తలెత్తినవి. ఈ రెండు అభిప్రాయముల బోధలు కూడ ద్వితీయోపదేశకాండము 24:1–4పై ఆధారపడి యుండినవి (5:31పై గల వ్యాఖ్యానము చూడు). షమ్మాయ్, ఈ రెండు అభిప్రాయ మతములలో అధికంగా సాంప్రదాయవాదులై యుండినవారి గుంపు, మోషే వివరించుచుండిన "అసభ్యత" వ్యభిచారమై యుండినదని నమ్మినది. అతడు తన దృక్పథమును ధర్మశాస్త్రముతో, అనగా వ్యభిచారమునకు జరిమానా విడాకులు కాదు, కానీ చావే గతి యని చెప్పిన విషయానికి, పొంతనగలదానిగా ఎలా చేసుకొన్నాడో మనకు తెలియదు (లేవీయకాండము 20:10–14; ద్వితీయోపదేశకాండము 22:22). హిల్లేల్, ఈ రెండు గుంపులలో ఎక్కువ ఉదారవాదమునకు సంబంధించిన గుంపు, భర్త మనస్సును గాయపరచి అతనికి అసంతుష్టిని కలుగజేయునది అది ఏదైనను "అసభ్యతయే" అని బోధించినది.[8]

వేదాంతశాస్త్ర సంబంధమైన ఈ నేపథ్యముతో, ఈ పరిసయ్యులు యేసును **పరీక్షించుటకు** ఆయన యొద్దకు వచ్చారు. "పరీక్షించుటకు" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*peirazō*) "శోధించుటకు" అని కూడ అనువదింపబడవచ్చును (16:1పై గల వ్యాఖ్యానము చూడు). సత్యమును నిర్ధారించవలెననునది వారి ఉద్దేశమే కాదు. కేవలము ఏదో ఒక విధంగా యేసును వేదాంతశాస్త్ర సంబంధితమైన మూర్ఖతప్పిదముగా గూర్చి ఇరుకులో ఇరికించుటయే వారి ఉద్దేశమై యుండినది. జనసమూహమును ఆయనకు విరోధముగా లేవదీయుటకు ఆయన ఇచ్చు సమాధానమును సదవకాశంగా ఉపయోగించుకొనవలెనని వారాశించియుండవచ్చును.

వారడిగిన ప్రశ్నకు ప్రతిస్పందించుచు, పండితులై యుండిన యూదా మత బోధకులకు చెందిన ఇరు పక్షములలో ఆయన ఏ పక్షమునైనను చేరకుండుట ద్వారా యేసు ఆయనను ప్రశ్నించుచుండినవారిని ఆశ్చర్యచకితులను జేసియుండును. ఆయన ద్వితీయోపదేశకాండములో వ్రాయబడియున్న మోషే బోధను సహితము చూడలేదు. దానికి బదులుగా, యేసు విషయము యొక్క మూలాధారమును ముఖ్యమైనదిగా తీసికొని వివాహము యొక్క దేవుని అసలు ప్రణాళికపై తన దృష్టిని కేంద్రీకరించాడు (ఆదికాండము 1:27; 2:24).

**వచనము 4.** యేసు తన సమాధానమును వారికి ఎదురు ప్రశ్న వేయుచు మొదలుపెట్టాడు, **... మీరు చదువలేదా?** అనడిగాడు (చూడు 12:3; 21:16, 42; 22:31, 32). సంతానోత్పత్తి మరియు సాహచర్యములనెడు ఉద్దేశములతో, దేవుడు వారిని రెండు విలక్షణమైన లింగములుగా, **పురుషునిగాను స్త్రీనిగాను, సృజించాడని** ఆయన సెలవిచ్చాడు. ఆయనతో వాదించుచుండిన వారికి సృష్టి క్రమము గూర్చి తెలియజెప్పుట ద్వారా, యేసు తాను చేయగలిగిన అత్యంత బలమైన ప్రతివాదమును చేయుచుండెను. "విషయము ఎంత ప్రాథమికమైనదై యుంటే, అంత బలమైనదని" యూదా మతబోధకులు చెప్పుచుండిరి.[9] దేవుని మౌలికమైన తాత్పర్యములో అత్యున్నతమైన అధికారము మరియు

అత్యంత బలమైన నిదర్శనము కలవు.

ఉదాహరణంగా చెప్పబడిన గ్రీకు ఉల్లేఖనము సెప్టువజింట్‌లోని ఆదికాండము 1:27నుండి తీసికొనబడినది: "దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను, ఆయన స్వరూపములో ఆయన వానిని సృజించెను; *పురుషునిగాను స్త్రీనిగాను ఆయన వారిని సృజించెను* (ఉద్ఘాటన గమనించండి). ఇదే విధమైన మాటలు ఆదికాండము 5:2లో కలవు: "*పురుషునిగాను స్త్రీనిగాను వారిని సృజించి,* వారు సృజించబడిన దినమున వారిని ఆశీర్వదించి వారికి నరులని పేరుపెట్టెను" (ఉద్ఘాటన గమనించండి).

ఒకరికొకరు పూరకముగా ఉపయోగపడుచు ఒకరినొకరు సంపూర్ణము చేయుటకు దేవుడు పురుషుని మరియు స్త్రీని సృజించాడు (ఆదికాండము 2:18, 24). ప్రాథమికమైన ఈ మనోకల్పిత ప్రణాళిక సమస్తమైన భవిష్యత్ లైంగిక సంభోగములకు మాదిరియై యుండుటకు ఉద్దేశింపబడినదై యుండెను. దాని స్వభావమునుబట్టియే, ఇందులో బహుభార్యాత్వము,[10] బహుభర్తృత్వము, మరియు విడాకులు మరియు పునఃవివాహములు మినహాయింపబడి యున్నవి. జాన్ క్రిసొస్తం ఇలా వ్రాయుచున్నాడు, "దేవుడు నరుని సృజించినప్పుడు, ఈ పురుషుడు తనకియ్యబడిన ఈ స్త్రీని విడనాడి, మరొక స్త్రీని తెచ్చుకొనవచ్చునని ఆయన చిత్తమై యుండినట్లయితే, ఆయన ఆనాడే అనేక మంది స్త్రీలను సృజించేవాడే."[11] స్వలింగ సంభోగము దేవుని ఉద్దేశము కానే కాదు (రోమీయులకు 1:26, 27). దేవుడు స్వలింగ సంభోగమును (పురుషులు, పురుషులతోను స్త్రీలు, స్త్రీలతోను సంభోగించుట) ఉద్దేశించియుండినట్లయితే, ఆయన ఆనాడే ఆదాము కొరకు మరొక పురుషుని, హవ్వ కొరకు మరొక స్త్రీని సృజించియుండెడివాడు. మానవులు దేవుని ఉద్దేశములను అక్రమంగా తిరగరాసినప్పుడు, దాని ఫలితం దారుణమైన దురదృష్టమౌతుంది.

**వచనము 5.** అటుతరువాత యేసు ఆదికాండము 2:24ను ఉదాహరణంగా వారికి చూపించాడు: **కాబట్టి పురుషుడు తన తండ్రిని తన తల్లిని విడిచి తన భార్యను హత్తుకొనును, వారు ఏకశరీరమై యుందురు.** భార్యాభర్తల మధ్య నుండు సంబంధము ఇతరమైన ప్రతి సంబంధము కంటె ఎంతో బలమైనది మరియు ప్రాధాన్యమైనదై యున్నది. పురుషుడు మరియు తన తలిదండ్రులకు మధ్య నుండు సంబంధమునకు మించబడినప్పుడు, వైవాహిక సంబంధములో "విడిచిపెట్టుట" మరియు "హత్తుకొనుట" సూత్రము అమలౌతుంది (చూడు KJV). పురుషుడు తన తలిదండ్రులను "విడిచిపెట్టి" తన భార్యను "హత్తుకొనవలెను" లేక "కలిసిపోవలెను" "విడిచి" అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*kataleipō*) "వదలిపెట్టు" అని కూడ అర్థమిచ్చును. పురుషుడు తన తలిదండ్రులను బొత్తిగా వదలుకొనడు (15:3–6), అయితే ఖచ్చితంగా వేరుగా ఉండవలెను. "హత్తుకొనును" లేక "కలిసిపోవును" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*kollaō*) ఆదిలో "జిగురుతో లేక సిమెంటుతో ఒకటిగా అంటుకొనిపోవుట" అని అర్థమిచ్చినది. వివాహంలో, భార్యాభర్తలు "ఏకశరీరమౌదురు" (ఎఫెసీయులకు 5:28–31). ఈ ఏకత్వము లైంగిక కలయిక ద్వారా అభివ్యక్తము చేయబడుచున్నది (చూడు 1 కొరింథీయులకు 6:16; 7:2–4).

**వచనము 6.** సృష్టి ఆధారంగా, యేసు వారికి ఈ ఆదేశమునిచ్చాడు: **గనుక దేవుడు జతపరచినవారిని మనుష్యుడు వేరుపరచకూడదు.** "జతపరచిన" అని అర్థమిచ్చు గ్రీకు పదమునకు (*suzeugnumi*) "ఇద్దరిని కలిపి కాడి మోపబడిన" అనునది అక్షరార్థమై

యున్నది. దేవుడు ఆది దంపతులను జత పర్చాడు, తద్వారా ప్రాథమిక కళ్యాణ మహోత్సవము జరిపాడు. వివాహము, దైవికమైన వ్యవస్థయై యున్నది. జీవితాంతము వరకు కూడ ఒక పురుషునికి ఒక భార్య/ఒక స్త్రీకి ఒక భర్త అనునది దేవుని ప్రాథమికమైన ప్రణాళికయై యున్నది (ఆదికాండము 2:21–25). ఈ కలయిక చిరకాలము నిలిచియుండవలెనని దేవుడు ఉద్దేశించియున్నాడు. వివాహము గూర్చిన ఈ ఉత్కృష్టమైన దృక్పథము, ఈ రోజుల్లో మన కొరకు ఉన్నట్లుగానే, యేసు రోజుల్లో కూడ ఒక విప్లవాత్మకమైన విషయమై యుండినది. దీనిని ఆర్. టి. ఫ్రాన్స్ ఇలా అభివ్యక్తము చేసాడు: "విడాకుల మూలమున *దేవుడు* చేసిన కార్యమును *మానవుడు* నిరర్థకము చేయుట ఈ విషయమంతటిని ఆమూలాగ్రముగా ఒక నూతన దృష్టికోణములో పెట్టుచున్నది."[12]

వివాహ కార్యము ద్వారా వారు **ఏక శరీరమగునట్లు** తొలి దంపతులను ఏకము చేసినవాడు దేవుడే గనుక, ఈ ఏకత్వము విచ్ఛిన్నము చేయబడవచ్చునను వివరములను నిర్దేశించగల న్యాయసమ్మతమైన హక్కు ఆయనకే ఉన్నది. దేవుని రూపకల్పన ప్రకారము, వివాహ బంధము మరణముతోనే అంతమౌతుంది, అప్పుడు బ్రతికియున్న దాంపత్య జీవిత భాగస్వామి పునఃవివాహము చేసికొనుటకు అది తావిస్తుంది (రోమీయులకు 7:1–3; 1 కొరింథీయులకు 7:39). దాంపత్య జీవిత భాగస్వాములలో ఏ ఒక్కరైనను లైంగిక విషయములో విశ్వాసఘాతుకముగా ఉండుటనుబట్టి కూడ వివాహ బంధము శాశ్వతముగా విడగొట్టబడవచ్చును, అప్పుడు విశ్వసనీయమైన భాగస్వామి పునఃవివాహము చేసికొనవచ్చును (5:31, 32; 19:9).

**వచనము 7.** అందుకు పరిసయ్యులు, **ఆలాగైతే పరిత్యాగ పత్రికనిచ్చి ఆమెను విడనాడుమని మోషే యెందుకు ఆజ్ఞాపించెను**? అని ఆయన నడిగారు. ఈ సంభాషణా క్రమము మార్కు వ్రాసిన సువార్తలో తిరగరాయబడింది. యేసు, "మోషే మీకేమి ఆజ్ఞాపించెను?" అని వారినడిగెను (మార్కు 10:3, 4), అందుకు పరిసయ్యులు, "పరిత్యాగ పత్రిక వ్రాయించి, ఆమెను విడనాడవలెనని మోషే సెలవిచ్చెనని" సమాధానం చెప్పారు. ఈ యూదులు చేయుచుండిన వాదోపవాదములతో కూడిన చర్చ ద్వితీయోపదేశకాండము 24:1–4పై ఆధారపడి యుండినది. పురుషుడు ఒక విడాకుల ధ్రువ పత్రమును వ్రాసి యిచ్చి తన భార్యను విడనాడవచ్చునని మోషే అనుమతించాడని పరిసయ్యులు వాదించారు (5:31పై గల వ్యాఖ్యానము చూడు).

**వచనము 8.** యేసు వివాహము యొక్క స్థిరత్వమును పరిరక్షించుచు వారికి సమాధానమిచ్చాడు. ఆయన వారి దృష్టిని దేవుని సృష్టి వైపు మళ్లించాడు (ఆదికాండము 1; 2). ప్రజలు వారి వివాహ బంధముల నిబద్ధతలను విచ్ఛిన్నము గావించుకొనునట్లు వారు మోషే ఆదేశములను ప్రయోగించుకొనుచుండిరి (ద్వితీయోపదేశకాండము 24:1–4). ఈ ఆదేశములు, వాస్తవమునకు, వివాహము యొక్క పవిత్రతను కాపాడుట కొరకు రూపొందింపబడినవి.[13] మోషే బోధలు సూచించాయని పరిసయ్యులు సూచించినట్లు అవి ఎన్నడను విడాకులను *ఆజ్ఞాపించలేదు,* గనుక అనుమతించలేదు (19:7). **మీ భార్యలను విడనాడ మోషే *సెలవిచ్చెనని*** (ఉద్ఘాటన చూడండి) యేసు సెలవిచ్చినప్పుడు, ఆయన ఈ సత్యమును నొక్కివక్కాణించాడు. విడాకులను ప్రోత్సాహించుటకు మోషే తన ఆదేశములను రచించలేదు, కాని అదుపు తప్పిన ఒక పరిస్థితిని క్రమబద్ధం చేయుచు నిర్వహించు

నిమిత్తము ఆయన వ్రాయుచుండెను. ప్రభువిచ్చిన సమాధానము మోషే ఉద్దేశమును సమర్థించుచున్నది.

కానీ మోషే ఈ ఏర్పాటును ఎందుకు చేసాడు? **మీ హృదయ కాఠిన్యమునుబట్టి** మోషే సెలవిచ్చాడని యేసు వారికి తెలియజెప్పాడు. విడాకుల విషయము దేవుని చిత్తము ప్రకారమైనది కాదు, కానీ విశేషంగా మానవ దుశ్శీలము వలననే అది తలెత్తినది. దేవుని ప్రజలు, ఆయన సెలవిచ్చిన ఆది నియమము (**ఆది నుండి**) యొక్క అసలు ఉద్దేశము నుండి తప్పి పడిపోయారు. కాబట్టి, తన కృపచొప్పుననే, కుటుంబ వ్యవస్థ మరియు కుటుంబ సభ్యులు యింకా ఎక్కువ హరించుకుపోవుటను నిరోధించుటకు మోషే ప్రస్తుత అభ్యాసములను క్రమబద్ధం చేయునట్లు దేవుడు ఆయనకు అనుమతినిచ్చాడు. దేవుడు విడాకులను ద్వేషించుచున్నాడని ప్రవక్తయైన మలాకీ వ్రాయుచున్నాడు (మలాకీ 2:14-16). ఈ విషయంలో దేవుడు ఎప్పుడైనాగాని తన మనస్సును మార్చుకొన్నట్లు క్రొత్త నిబంధనలో ఏదియును సూచించుటలేదు. వాస్తవమునకు, మత్తయి 19:3-9, వివాహము గూర్చి దేవుని ప్రాథమికమైన సంకల్పమును పునఃరుద్ధరించుటకు యేసు చేసిన ప్రయత్నమును మనముందుంచుచున్నది.

**వచనము 9. వ్యభిచారము నిమిత్తమే తప్ప, తన భార్యను విడనాడి మరియొకతెను పెండ్లిచేసికొనువాడు, వ్యభిచారము చేయుచున్నాడని** అంటూ యేసు ఈ విషయాన్ని అంతటితో ముగించాడు. వారు ఒక ఇంటిలో ఉన్నప్పుడు శిష్యులడిగిన ప్రశ్నకు యేసు సమాధానమిచ్చుచు ఈ మాటలు పలికాడని మార్కు 10:10 చెప్పుచున్నది. యేసు వారికిచ్చిన సమాధానముతో పరిసయ్యులు వారి నోళ్లు మూయించబడినవారై, యేసు ఈ మాటలు పలుకక ముందే అచ్చటి నుండి నిష్క్రమించియుందురు. ఈ అధ్యాయంలో, 10వ వచనము వరకు కూడ శిష్యులు పేర్కొనబడలేదు.

ఇచ్చట విడాకులు మరియు పునర్వివాహములను గూర్చి మనముందున్న యేసు ఉపదేశము ఆయన కొండ మీద చేసిన ప్రసంగములో సెలవిచ్చిన వివరాలను సంపూర్తిచేయుచున్నది: "వ్యభిచారము నిమిత్తమే తప్ప, తన భార్యను విడనాడి మరియొకతెను పెండ్లిచేసికొనువాడు, వ్యభిచారము చేయుచున్నాడనియు, విడనాడబడిన దానిని పెండ్లిచేసికొనువాడు *వ్యభిచారము చేయుచున్నాడనియు* మీతో చెప్పుచున్నానని వారితోననెను" (5:32; ఉద్ఘాటన గమనించండి).

ఒకడు "ఏ హేతువుచేతనైనను" తన భార్యకు విడాకులియ్యవచ్చునా యని పరిసయ్యులు యేసునడిగారు (19:3). "లేదు" అని యేసు ఇచ్చిన సమాధానము, దేవుని సృజనాత్మకమైన రూపకల్పనపై ఆధారపడి యుండినది. అటుతరువాత, సాధారణమైన ఈ నియమముకు "నీతిబ్యామైనది" మినహాయింపై యుండినదని యేసు తన శిష్యులతో చెప్పాడు.[14] "దుర్నీతి" అని అనువదింపబడిన గ్రీకు పదము, "జారత్వము" (KJV) మరియు "వైవాహిక విశ్వాసఘాతుకము" (NIV) అని కూడ కొన్ని పర్యాయములు అనువదింపబడిన పదము, చట్టవిరుద్ధమైన ప్రతి విధమైన లైంగిక సంభోగము కలిసియున్న *porneia*, పదమైయున్నది. ఈ పదము "వ్యభిచారము" (*moicheia*) ను మించి విశాలార్థము నిచ్చుచున్న పదమై యుండి, దాంపత్య భాగస్వాములలో ఏ ఒక్కరైనను కలిగియుండు వివాహేతర లైంగిక సంబంధమును సూచించుచున్నది.[15]

పురుషులు వారి విశ్వాసహీనులైన భార్యలను విడనాడవచ్చునని మినహాయింపును సూచించుచున్న ఉపవాక్యము అనుమతించినను, వారు అలా చేయవచ్చునని అది (యూదా మత బోధకుల సాంప్రదాయము అనుమతించినట్లుగా)[16] వారికి ఆజ్ఞాపించలేదు. యథార్థముగా మారుమనస్సునొంది ఒకరి నొకరు క్షమించుకొనుట వలన వివాహము పునఃరుద్ధరింపబడి యుండవచ్చును.

## శిష్యుల ప్రతిస్పందన (19:10-12)

**[10]ఆయన శిష్యులు–భార్యాభర్తలకుండు సంబంధము ఇట్టిదైతే పెండ్లి చేసికొనుట యుక్తము కాదని ఆయనతో చెప్పిరి. [11]అందు – కాయన అనుగ్రహము నొందిన వారు తప్ప మరి ఎవరును ఈ మాటను అంగీకరింపనేరరు. [12]తల్లి గర్భమునుండి నపుంసకులుగా పుట్టినవారు గలరు, మనుష్యులవలన నపుంసకులుగా చేయబడిన నపుంసకులను గలరు, పరలోక రాజ్యమునిమిత్తము తమ్మును తామే నపుంసకులనుగా చేసికొనిన నపుంసకులును గలరు. (ఈ మాటను) అంగీకరింప గలవాడు అంగీకరించును గాక అని వారితో చెప్పెను.**

**వచనము 10**. సన్నివేశము యిప్పుడు మారిపోవుచున్నది – యేసు పరిసయ్యులతో జరిపించుచుండిన బహిరంగ వాదోపవాదము యిప్పుడు ఒక ఇంటిలో **తన శిష్యులతో** జరుగుచున్న చర్చగా మారిపోవుచున్నది (మార్కు 10:10). అయితే వారు చర్చించుచుండిన అంశము మారలేదు, అది విడాకుల గూర్చిన చర్చగానే మిగిలిపోయింది ఆయనను వెంబడించుచుండినవారికి విడాకులు ఒక ఐచ్ఛికమైన అంశమై యుండకూడదని – గనుక ఆ ఒక మినహాయింపు దాంపత్య భాగస్వాములలో ఏ ఒక్కరైనను కలిగియుండు జారత్వము లేక లైంగిక సంబంధమైన దుర్నీతియై యుండినదని, యేసు చెప్పుచుండెనని శిష్యులు అర్థంచేసికొన్నారు. ఈ విషయమును అర్థంచేసికొనుటలో ఉండిన కష్టమును గ్రహించి, **భార్యాభర్తలకుండు సంబంధము ఇట్టిదైతే పెండ్లి చేసికొనుట యుక్తము కాదని** ఆయనతో చెప్పారు. శిష్యుల గ్రహింపు ఈ విధంగా ఉండినది: "దుర్నీతిమయమైన ఒక వివాహములో నుండి బయటపడుటకు మరణము లేదా జారత్వము తప్ప మరొక మార్గము లేనట్లయితే, వివాహము చేసికొనకుండా ఒంటిగా నుండుటయే మేలు."

దీనికి ముందు, విడాకుల విషయంలో హిల్లెట్ వర్గమువారు కలిగియుండిన విశాల దృక్పథమును శిష్యులు యేసుతో పంచుకొని యుందురు. దాదాపుగా ఏ హేతువునుబట్టియైనను విడాకులు ఇవ్వబడవచ్చునని అనుమతింపబడుట మాత్రమే కాదు, కానీ పురుషుడు దుర్నీతిపరురాలైన తన భార్యను విడనాడుట అతనికి ఒక విధియై యుండినదని కూడ కొందరు యూదులు పరిగణించారు.[17]

**వచనము 11. అనుగ్రహము నొందినవారు తప్ప, మరి ఎవరును ఈ మాటను అంగీకరింపనేరరని** యేసు తన శిష్యులతో చెప్పాడు. యేసు చెప్పిన మాటలు కనీసము రెండు కోణాల్లో అర్థంచేసికొనబడినవి. "ఈ మాట" లేక "ఈ పదము" (*logos*) యేసు దీనికి ముందున్న విభాగములో వివాహము గూర్చి ఉపదేశించిన తన బోధకు సంబంధించిన ఒక ప్రస్తావనయై యుండినదని ఒక దృష్టికోణం చెప్పుచున్నది (19:3-9). NJB (బైబిల్) ఈ అనువాదమును ఇలా విశదీకరించుచున్నది: "కానీ, 'నేను చెప్పిన విషయములను ప్రతి

ఒక్కరు అంగీకరించలేరు, కానీ అనుగ్రహము నొందినవారు మాత్రమే అంగీకరించుదురని' ఆయన చెప్పాడు." ఈ సందర్భములో, వైవాహిక స్థితి దేవుడనుగ్రహించిన ఒక వరముగా దృష్టింపబడినది. దీనిని "అంగీకరింపనివారు" బ్రహ్మచారులుగా/అవివాహితులుగా నిలిచియుండువారై యున్నారు (19:12).

మరొక దృష్టికోణం, "ఈ మాట" శిష్యులు "పెండ్లి చేసికొనుట యుక్తము కాదు" అని పలికిన మాటల గూర్చిన ప్రస్తావనయై యున్నదని చెప్పుచున్నది (19:10). ఈ సందర్భములో, శిష్యుల మౌలికమైన తుది అభిప్రాయముతో – అనగా, కొందరు వివాహము చేసికొనకుండానే బాగుంటారను అభిప్రాయముతో యేసు ఏకీభవించుచుండెను. ఏది ఏమైనా, బ్రహ్మచారులుగా/అవివాహితులుగా నిలిచియుండగల సామర్థ్యము అందరికి లేదని ఆయన ఎరిగి యుండెను (1 కొరింథీయులకు 7:2). ఒకడు వివాహము యెడల కలిగియున్న సామర్థ్యము అది వానికి "దేవుడనుగ్రహించిన ఒక వరమై" యున్నదని పౌలు భావించాడు (చూడు 1 కొరింథీయులకు 7:7).

**వచనము 12.** ప్రజలు ఎందుకు అవివాహితులుగానే నిలిచియుండగోరుదురో, యేసు మూడు కారణములను మన ముందుంచుచున్నాడు. మొదటి మరియు రెండవ కారణము శారీరక సంబంధమైన పరిస్థితులను సూచించుచున్నవి. ఈ రెండూ కలిపి, మూడవ హేతువునకు దారీతీయును, అది ఆధ్యాత్మికమైన ఎంపికయై యున్నది. ఈ చివరి కారణము ఈ వచనములోని ప్రధానాంశమై యున్నది.

మొదటిగా, **తల్లి గర్భము నుండి నపుంసకులుగా పుట్టినవారు కలరని** ప్రభువు సెలవిచ్చాడు. వారిలోని ఆజన్మసిద్ధమైన అవలక్షణాలు కొందరు పురుషులను నపుంసకులుగా చేసినవి. యూదా మత బోధకుల సాహిత్యము వీరిని "సహజ నపుంసకులు" అని సంబోధించుచున్నది.[18] స్పష్టంగా, అవివాహితులుగానే నిలిచియుండుట, లైంగిక సంభోగ అవసరము మరియు ఆశకు సంబంధించినంతవరకు వారికి అదొక కష్టమైన సవాలు కాదు.

రెండవది, **మనుష్యుల వలన నపుంసకులుగా చేయబడిన నపుంసకులు కలరని** యేసు సెలవిచ్చాడు. "మనుష్యుల వలన నపుంసకులుగా చేయబడిన" అను పదజాలము యూదా మత బోధకుల తెలియజెప్పుచుండిన విషయములలో ఒక సామాన్యమైన సంగతై యుండినది.[19] వారి వృషణాలు పనిచేయకుండా (శస్త్ర చికిత్స ద్వారా తొలిగించుటతో సహా) చేయబజిన పురుషులను ఇది సూచించినది. ఈ అభ్యాసమును యూదులు ఇష్టపడలేదు,[20] ఏలయనగా ఇటువంటి వారు దేవుని యెదుట సమావేశమగుచుండిన వారిలో చేరుటను (ద్వితీయోపదేశకాండము 23:1), లేదా దైవపీఠము యొద్ద సేవచేయుటను (లేవీయకాండము 21:20, 21) ధర్మశాస్త్రము మినహాయించినది. ఏదిఏమైనా, వృషణముల తొలగింపు అన్యజనులలో ఒక సామాన్యమైన వాడుకయై యుండినది. ప్రాచీన టర్కీ, బాల్కన్ రాష్ట్రాలలో, నేరస్థులకు ఇదొక శిక్షయై యుండినది.[21] ఇంకా, కొందరు అన్యమతారాధికులై యుండిన పూజారులలో మతసంబంధమైన ఉద్దేశముల నిమిత్తము వారి వృషణములు తొలగింపబడినవి.[22] వారి ఆధీనములో క్రింద నుండు స్త్రీల ద్వారా కలుగు సంతానోత్పత్తిని నిరోధించునట్లు, ఒక రాజు యొక్క స్త్రీల అంత:పురమును గూర్చి యాజమాన్యము వహించుచుండిన పురుషులు తరుచుగా నపుంసకులు గావింపబడిరి (చూడు ఎస్తేరు 2:14).

నపుంసకులు ఎక్కువ సాధువైనవారును, రాజభక్తిగలవారునై యుండినందు వలన ప్రభుత్వ ఉన్నతాధికార పదవులలో నపుంసకులే ఉండవలెనని కొందరు పరిపాలకులు కోరుకొనుచుండిరి.[23]

ఇటువంటి రాజగృహ అధికారుల గూర్చిన ఉదాహరణములు మనము పాత మరియు క్రొత్త నిబంధనలో చూడగలము. దానియేలు మరియు అతని ముగ్గురు స్నేహితులు బబులోనుకు తరలింపబడిన తరువాత నపుంసకులు గావింపబడిరని సూచింపబడినది. ఈ అభిప్రాయమునకు, రాజ కుటుంబముల సంతానము "బబులోను రాజు నగరునందు నపుంసకులుగా చేయబడుదురు" అను ప్రవచనము తోడగుచున్నది (2 రాజులు 20:18; యెషయా 39:7; KJV). ఈ నలుగురి గూర్చిన బాధ్యత "రాజు యొక్క నపుంసకుల అధిపతికి" అప్పగింపబడినదను విషయము వాస్తవమై యున్నది (దానియేలు 1:3; KJV).[24] క్రొత్త నిబంధనలో, సుప్రసిద్ధుడైన ఐతియోపీయ నపుంసకుడు, ఫిలిప్పు చేత బాప్తిస్మమియ్యబడినవాడు, ఐతియోపీయుల రాణియైన కందాకే క్రింద మంత్రియై ఆమె యొక్క ధనాగారంతటి మీద విశ్వసనీయమైన ఒక అధికారిగా పనిచేయుచుండెను (అపొస్తలుల కార్యములు 8:27).

మూడవదిగా, **పరలోక రాజ్యము నిమిత్తము తమ్మును తామే నపుంసకులనుగా చేసికొనిన నపుంసకులును గలరని** ప్రభువైన యేసు చెప్పాడు. ఈ చివరి వర్గము అలంకారయుక్తంగా అర్థంచేసికొనబడవలెను.[25] వారికిష్టముండినట్లయితే వీరు వివాహం చేసుకొని పిల్లలను కనగలిగినవారై యుండిరి. ఏదిఏమైనా, వీరు, పౌలు వలెనే, ఎటువంటి భయము, చింత, మరియు కుటుంబ బాధ్యతల వలన కలుగు అవసరత లేకుండా దేవుని స్వేచ్ఛతో సేవించు నిమిత్తమై వివాహమాడుటకు కోరుకొనలేదు (1 కొరింథీయులకు 7:32–34).

ఈ విధంగా, "ఈ మాటను అంగీకరింపగలవాడు అంగీకరించునుగాక" అని చెప్పుచు యేసు ఈ చర్చను ముగించాడు. "అంగీకరించు" అను పదము (*chōreō*) 11వ వచనములో నుండి పునఃరుక్తము గావింపబడినది. ఆయన చెప్పుచుండిన మాట, వివాహము గూర్చి ఆయన వివరించుచుండిన విషయమును అంగీకరించుట గూర్చినదై యుండును. లేదా అది మామూలుగా బ్రహ్మచర్యమును పాటించువారుగా లేక అవివాహితులుగా నుండు స్థితిని సూచించుచుండినదై యుండును. ఈ సందర్భములో, ఆయనను వెంబడించుచుండినవారిలో బహు కొద్ది మంది బ్రహ్మచర్య జీవితమును లేక వివాహము చేసికొనకుండా నుండగల జీవితమును కోరుకొనుచున్నారని యేసు ఎరిగియుండును.[26] సంభాషణ ముగిసిన తదుపరి, యేసు తన శిష్యుల ముందు రెండు ఎంపికలనుంచాడు: విడాకులు (దాంపత్య ద్రోహమునుబట్టి తప్ప) లేని వివాహము లేదా బ్రహ్మచర్యము.

## ✧✧✧✧✧ పాఠములు ✧✧✧✧✧

### వివాహము (19:3–12)

విడాకులు, అమెరికా సంయుక్త రాష్ట్రములలో సమాజమంతటినీ కలిచివేస్తున్న ఒక అంటువ్యాధియై యున్నది. ఈ రోజుల్లో జరిపింపబడుచున్న 40% వివాహములు ఉద్దేశపూర్వకమైన ముగింపునకు వచ్చునని క్రమబద్ధంగా సంగ్రహించిన సంఖ్యా వివరాలు

సూచించుచున్నవి.[27] విడాకులు తీవ్ర మనస్తాపం కలిగించు బాధాకరమైన అనుభవమై యున్నది; అది, ఒక వివాహం ప్రాణాంతకమైన పరిస్థితై యున్నది. మనము చదువుచున్న వాక్యభాగము అత్యంత ప్రాధాన్యమైన విషయములు, వివాహము, విడాకులు, మరియు పునఃవివాహము గూర్చి మనకేమి నేర్పించుచున్నది?

*గందరగోళముగా నున్న పరిస్థితి – రెండు పరస్పరము వ్యతిరేకించుకొనుచున్న దృక్పథములు* (19:3). యేసు కాలములో పరస్పరము వ్యతిరేకించుకొనుచుండిన రెండు దృక్పథములు ప్రబలియుండినవి. ద్వితీయోపదేశకాండము 24:1–4లో గల "అపవిత్రమైన అంశము" వ్యభిచారమే అయియుండునని షమ్మాయ్ ("సాంప్రదాయవాదము") వర్గము చెప్పుచుండినది. విడాకులను సమర్థించిన అపవిత్రమైన అంశము భర్తకు అసంతుష్టికలుగజేయునది ఏ విషయమైనను అయియుండవచ్చునని హిల్లేల్ ("ఉదారవాదము") చెప్పుచుండినది.

ఇవి పరస్పరము విరుద్ధమైనవై యుండి యేసును ప్రశ్నించిన పరిసయ్యుల మనస్సుల్లో ఘర్షణలు కలుగజేయుచుండిన ఆలోచనలై యుండినవి. అయితే స్పష్టముగా అసలు సత్యమేమిటో కనుగొనవలెననునది వారి లక్ష్యమై యుండలేదు; ఎంతసేపూ యేసును ఇబ్బందిలో ఇరికించవలెననియే వారాశించుచుండిరి. అయితే యేసు చర్చలో ఏ ఒక్క పక్షమునైనను వహించకుండా వారిని ఆశ్చర్యములో ముంచెత్తాడు.

*రక్షకుడు చేసిన దిద్దుబాటు – "సృష్టికర్త యొద్దకే తిరిగి రావలెను"* (19:4–6). విడాకులను మరింత విచ్చలవిడి చేయుటకుగాని లేదా దానిని మరింత సులభతరము చేయవలెననిగాని యేసు ప్రయత్నించలేదు. ఆయన విడాకులను సమర్థించలేదు, కాబట్టి ఆయన నిశ్చయముగా దాని గూర్చి ఆజ్ఞాపించలేదు. ఆయన ఈ విషయములు గూర్చి చెప్పిన బోధను వారంగీకరించునట్లు ఆయన ప్రజలలో తనకుండిన స్థానములను ఉపయోగించుకొనలేదు, సరికదా ఈ సదుద్దేశము గూర్చి మోషేను కూడ వాడుకొనలేదు. దానికి మారుగా, ఆయన వారి దృష్టిని ఆదికాండములో దేవుడిచ్చిన ప్రథమ శాసనము వైపు మళ్లించాడు.

ఒక స్త్రీకి జీవితాంతము వరకు ఒక పురుషుడనునది దేవుని రూపకల్పనయై యున్నది (ఆదికాండము 2:21–25). దీనిలో బహు భార్యాత్వము, బహుభర్తృత్వము, మరియు స్వలింగ సంభోగము కలుపబడలేదు (రోమీయులకు 1:26, 27). మానవులు దేవుని ఏర్పాటును వదిలిపెట్టి పక్కదారి పట్టినప్పుడు, ఆ పరిస్థితి పాపము మరియు నిస్సంతోషముగానే పరిణమించును.

*చిక్కుబడిన దృశ్యము – "విడాకులు మోషే అనుమతించాడు"* (19:7–9). వారి వాదోపవాదములలో దేవునికి ఎదురుగా మోషేను నిలువబెట్టుటకు యూదులు ప్రయత్నించారు. వారు వివాహము యొక్క పవిత్రతను కాపాడుట కొరకు కాదు, కానీ వివాహమును రద్దుచేయుటకు అనుమతిని సమకూర్చుకొనవలెనను ఉద్దేశముతో విడాకుల గూర్చి మోషే సెలవిచ్చిన శాసనమునే ఉపయోగించుచుండిరి.

"అలాగైతే ఆమెకు ఒక పరిత్యాగ పత్రికను ఇవ్వవలెనని మోషే ఎందుకు ఆజ్ఞాపించాడు?" అని వారడిగారు. ఇదొక మంచి ప్రశ్నే. యేసు ఇచ్చిన సమాధానమేమిటి? – "మీ హృదయ కాఠిన్యమును బట్టియే." వాస్తవమునకు, మోషే ఎన్నడను విడాకుల గూర్చి

ఆజ్ఞాపించలేదు; ఆయన వివాహ వ్యవస్థను కాపాడు నిమిత్తము అది వరకున్న పద్ధతినే సామాన్యంగా క్రమబద్ధీకరణము చేయుచుండెను.

వారు యేసునడిగిన ప్రశ్న: "ఏ హేతువుచేతనైనను పురుషుడు తన భార్యను విడనాడుట న్యాయమా?" ఒకే ఒక్క న్యాయసమ్మతమైన హేతువున్నదనియు, అది దాంపత్య జీవిత భాగస్వాములలో ఏ ఒక్కరైనను ప్రదర్శించు "దుర్నీతి" (లైంగిక సంభోగ ద్రోహము) యని ఆయన సమాధానమిచ్చాడు. పునర్వివాహమును గూర్చిన ప్రస్తావనను యేసే లేవదీసాడు. విడాకుల హేతువు భార్యాభర్తలిరువురిలో ఏ ఒక్కరైనా చేయుచుండు జారత్వమైనట్లయితే, అది అనుమతింపబడినదని ఆయన చెప్పాడు.

*జటిలమైన పరిస్థితి – "పెండ్లి చేసికొనకుండుటయే ఉత్తమము"* (19:10–12) ఈ విషయముల గూర్చి యేసు చెప్పుచుండిన ఉపదేశమును శిష్యులు కష్టమైన అంశముగా ఎంచారు. ఈ రోజుల్లో అనేకుల అభిప్రాయము కూడ ఇదే. విడిపించుకొని బయట పడుటకు అత్యంత కష్టమైనదిగా నుండు ఒక వైవాహిక సంబంధ జీవితములోనికి ప్రవేశించుట కంటె, అసలు వివాహము చేసికొనకుండా ఉండుటయే ఉత్తమమై యుండగలదని శిష్యులు గ్రహించగలిగారు.

ఆయన వారికి చెప్పుచుండిన విషయములు గూర్చి వారికుండిన గ్రహింపుతో యేసు ఏకీభవించాడు. అదొక కష్టమైన విషయమే అనియు, దానిని ప్రతి ఒక్కరు అంగీకరించలేరు లేదా దాని ప్రకారంగా ప్రతి ఒక్కరు జీవించలేరని ఆయన అంగీకరించాడు. పరలోక రాజ్యము నిమిత్తమై వివాహము యొక్క పవిత్రతను ఉల్లంఘించుట కంటె "నపుంసకులుగా" (బ్రహ్మచారులుగా/అవివాహితులుగా) నిలిచియుండుటయే ఉత్తమమని ఆయన తన తుది అభిప్రాయమును వెల్లడించాడు.

## విడాకులు: ఒక అంటువ్యాధి (19:3–12)

వివాహములు ఎందుకు విచ్ఛిన్నమౌతున్నాయి? మీరాలోచించుటకు నాలుగు కారణాలు.

1. *వివాహము దేవుడు స్థాపించిన వ్యవస్థ యని ఎంచబడక, కేవలము మానవుల ఏర్పాటు అని దృష్టింపబడుట.* వివాహమును దేవుడు వ్యవస్థాపించి ఆశీర్వదించాడని మన సమాజము తెలిసికొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. స్వస్థలము మరియు స్వకుటుంబము దేవుని శాసనాధారంగా ఉత్పన్నమయ్యాయి (ఆదికాండము 1:27, 28; 2:18–24). వారి జీవిత పర్యంతమైన నిబద్ధత నిమిత్తము వారు ఏకమై యుండవలననియు, ఈ ఐక్యతను రద్దుచేయుటకు ఆయన మాత్రమే హేతువు నీయగలడనియు తెలియజెప్పుచు తొలి దంపతులను జతపర్చినది దేవుడే అని యేసు సెలవిచ్చాడు.

వివాహముపై దేవునికి ఎటువంటి అధికారము లేదని ప్రజలనుకొనవచ్చును. వైవాహిక అనుబంధములో గల ఆశీర్వాదము యొక్క అనుకూలతను సద్వినియోగము చేసికొనకుండానే అనేక మంది భార్యాభర్తలుగా కలిసిమెలిసి జీవించుచున్నారు. ఇతరులు స్వదేశ చట్టములను పాటించుదురు, కానీ అంతకు మించిన అధికారమున్నదని గుర్తించారు. ఏది ఏమైనా, దేవుని శాసనములు అధికారపూర్వకమైనవై యున్నవి, గనుక అవి సమస్త మానవాళి సంక్షేమ శ్రేయాభివృద్ధి కొరకే ఉద్దేశింపబడినవై యున్నవి.

2. *వివాహము జీవితాంతము బద్ధులమై యుండవలసిన విషయముగా కాదు గాని ఇరువురిలో ఏ ఒక్కరైనను వివాహబంధమును తెంచుకొని వెళ్లిపోవలెనని తీర్మానించుకొనునంత వరకే వర్తించు విషయముగా దృష్టింపబడుచున్నది.* దంపతులు పెళ్లినాటి ప్రమాణాలను తరుచుగ బహు చులకనగా తీసికొంటారు. ఈ పరిస్థితిని మనము అవిశ్వాసుల నుండి ఆశింపవచ్చునేమో కానీ క్రైస్తవుల నుండి కాదు.

కాబట్టి, మూర్ఖత్వము, వివాహము విచ్ఛిన్నమగుచుండు విషయములో దాని పాత్ర వహించగలదు. వివాహము విషయంలో దేవుని ప్రణాళిక ఏమైయున్నదో అను వివరములు బోధింపబడనివారు, సమాజములో ప్రబలముగా ప్రబలియున్న విడాకులు మరియు పునఃవివాహము శుద్ధ తప్పు అని కూడ అర్థంచేసికొనడం లేదంటే మనము ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. దేవుని నియమములు ఆధిక్యం వహించి అమలగుచుండవలెనని ప్రజలకు బోధింపవలెను. మానవుడు అనుమతించు ప్రతి విషయమును దేవుడు ఆమోదించడు. మనము మన దేశ చట్టమునకు లోబడవలసినవారమై యున్నాము (రోమీయులకు 13:1, 2), కానీ అవి దేవుని నియమములతో ఘర్షణపడకూడదు.

3. *వివాహములో సామాన్యమైన ఆధ్యాత్మిక అనుబంధమనునది లేదు.* “మిశ్రమ” వివాహములు ఇశ్రాయేలు ప్రజలలో నెలకొనియుండిన మహమ్మారి వ్యాధియై యుండినది (ఎజ్రా 9; 10; నెహెమ్యా 13:23–27). జాతుల మధ్య జరుగుచుండినవి కాదు కానీ మిశ్రమ మతముల వివాహములు సమస్యయై యుండినవి. తన విశ్వాసమునకు వెలుపటి స్త్రీని/పురుషుని వివాహం చేసికొనగోరు క్రైస్తవ విశ్వాసికి, విపత్తును కలుగజేయుటకు సర్వసన్నద్ధమైయున్న సూత్రము వారి యెదుటనే ఉన్నది. ఈ సందర్భము చొప్పున సఫలీకృతమగుచున్న వివాహములను వేళ్ల మీద లెక్కించవచ్చును.

అవిశ్వాసిని, అటుతరువాత విశ్వసనీయమైన తన క్రైస్తవ విశ్వాసము లోనికి మార్చవచ్చునని ఆశించువారెవరైనను, ఈ పని వివాహమునకు ముందే చేయవలెను. ఆ తరువాత, అసలైన వివాహ కార్యక్రమమును చేపట్టక మునుపు, కాబోయే భర్తలో లేక భార్యలో కలిగిన మారుమనస్సు విశ్వసనీయమైనదై యున్నదని రూఢిపర్చుకొనుటకు చాలినంత కాలము వేచియుండవలెను.

4. *వివాహంలో నిజమైన ప్రేమ ఉండదు.* వివాహములన్నియును నిస్వార్థమైన అగాపే *agape* రకమైన ప్రేమపై ఆధారపడినవై యుండవు. కొన్ని వివాహములు శారీరక అందచందాల ఆకర్షణపై మాత్రమే ఆధారపడినవై యుండును. ఇతరమైనవి అర్థిక భద్రత లేక సామాజిక స్థాయిపై ఆధారపడినవై యుండును. కొందరు వైరభావముతో వివాహమాడుదురు, కానీ చివరకు వారు తమ్మునుతామే గాయపర్చుకొందురు.

దంపతులు ఒకరినొకరు యథార్థముగా ప్రేమించుకొనినప్పుడు, ఏ సమస్యయైనను పరిష్కరించుకొనబడగలదు. తప్పిదములను క్షమించుకొనవచ్చును, స్వార్థమును తొలగించుకొనవచ్చును (ఎఫెసీయులకు 5:22, 23, 28, 29).

సాధారణమైన సమస్య ఒకటున్నది – కొరతపడిన సిద్ధపాటు. కొందరు దంపతులు, ముఖ్యంగా యౌవనములో, వివాహము చేసికొనుటకు ఆతురపడుదురు, దాని గూర్చి గంభీరముగా ఆలోచించరు మరియు సిద్ధపడరు. కొన్ని ప్రయత్నములు ఈ విధానములో సఫలీకృతమగును. జయప్రదమైన వివాహమునకు శారీరక, మానసిక, నైతిక, ఆర్థిక,

మరియు ఆధ్యాత్మిక సిద్ధపాటు అవశ్యకమై యున్నవి. కొన్ని వివాహ బంధములు ఎందుకు విఫలమగుచున్నవో యను వివరమును వివాహమునకు ముందే తెలిసికొనుట ద్వారా, వారి వైవాహిక జీవితంలో ఎదురయ్యే కొన్ని ఎదురుచూడని ప్రమాదములకు కాబోయే దంపతులు దూరంగా ఉండవచ్చును, వారి వైవాహిక జీవితమును చిరకాలము సుఖదాయకము చేసికొనవచ్చును.

## సమస్యను సరిదిద్దుకొనుటకు దానిని సృజనాత్మకముగా సమీపించుట (19:3–12)

అతి తరచుగా, మనము ఒక సమస్యను పరిష్కరించుకొనుటకు తప్పుడు విషయముతో మొదలుపెట్టుదుము. మనము చేసే ప్రయత్నములు, కొటారములో నుండి పరుగెత్తుకొని పారిపోయిన గుఱ్ఱమును పట్టుకొనవలెనని చేయు ప్రయత్నముల వలె ఉంటాయి. గుఱ్ఱము బయటికి వెళ్లక మునుపే ద్వారమును మూసివేయుట ఎక్కువ తెలివైన పని కాదా? అదేవిధంగా, విడాకుల సమస్యను ఎదుర్కొను దంపతులకు సలహా సహాయము చేయుట కంటే, కుటుంబములోని సంబంధములను బలపర్చుకొనుట ఎక్కువ తెలివైన పనై యుండును. సంఘ సభ్యులు వారి వైవాహిక జీవితములను బలపర్చుకొనుచు, సుఖ కుటుంబములను కట్టుకొనునట్లు ప్రతి సంఘములోని పెద్దలు సభ్యులకు నేర్పించినట్లయితే, వారు జ్ఞానయుక్తమైన పని చేసినవారౌదురు. సుఖ కుటుంబముల గూర్చిన సదస్సులు లేదా తరగతులు సంఘములో అప్పుడప్పుడు నిర్వహింపబడుచుండవలెను. వివాహము యొక్క పవిత్రత, కుటుంబములో భర్త మరియు భార్య వహించవలసియుండు పాత్రలు మొదలగు విషయాల గూర్చి అధ్యాపకులైనవారు యువతీయువకులకు ఉపదేశింపవలెను. డేటింగ్ విషయములో దైవభక్తి మరియు భయము అత్యావశ్యకమై యున్నవనియు, భాగస్వామిలో ఉండాలని కోరుచున్న విషయాలేమిటో చూచుకొనవలెననియు వారికి నేర్పించవలెను. వివాహమునకు పూర్వము సలహా సమావేశములకు దంపతులు తప్పనిసరిగా హాజరు కావలెనని వివాహములు జరిపించు బోధకులు దానిని ఒక విధిగా నియమించవలెను. సంఘారాధన సమయాల్లో అప్పుడప్పుడు వివాహము మరియు కుటుంబ జీవితము గూర్చిన అంశములపై సందేశములను అందించుచుండవలెను.

---

సూచనలు

[1]ఈ కాలవ్యవధి గూర్చి మత్తయి వ్రాసిన సువార్తలో కంటె లూకా వ్రాసిన సువార్తలో మరి ఎక్కువ సమాచారము కలదు (చూడు లూకా 13:22–18:34). లూకా వ్రాసిన సువార్తలో విశిష్టమైనవై యున్న అనేక కథలు పెరియ ప్రాంతములో కంటె బహుశా గలిలయ మరియు సమరయలో జరిగియుండను (లూకా 13:22; 17:11). [2]Josephus *Antiquities* 17.8.1; *Wars* 3.3.3. [3]Mishnah *Yebamoth* 14.1. [4]Mishnah *Arakhin* 5.6; *Nedarim* 11.12. [5]Josephus *Antiquities* 15.7.10. [6]Ibid., 18.5.4. [7]Ibid., 4.8.23. జోసీఫస్ తన మూడవ భార్య యొక్క "ప్రవర్తనతో సంతుష్టిచెందనందు వలన" ఆమెకు విడాకులిచ్చాడు (Josephus *Life* 76). [8]Mishnah *Gittin* 9.10. అటుతరువాత "అతడు ఆమె కంటె అందమైన మరొకరిని కనుగొనినప్పటికిని"అని యూదుల మతోపదేశకుడైన అకిబ చెప్పాడు. ఈ మాటలు పలుకుటకు ఆయన ద్వితీయోపదేశకాండము 24:1 లోని, "ఆమె మీద అతనికి ఇష్టము తప్పిన యెడల" అను మాటలను ఆధారంచేసికొన్నాడు. [9]Leon Morris, *The Gospel according to Matthew,* Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 480-81. [10]ఖుమ్రాన్‌లో, బహుభార్యత్వమును వ్యతిరేకించుటకు ఆదికాండము 1:27 ఉదాహరణముగా పేర్కొనబడినది. (*Damascus Rule* 4.20-5.2.) ఏది ఏమైనా, ప్రధాన యూదా

మతస్థులు బహుభార్యాత్వమును అనుమతించారు. సామాన్యమైన పురుషులు నలుగురు లేదా ఐదుగురు భార్యలను కలిగియుండవచ్చునని అనుమతింపబడగా, రాజులు 18 మంది స్త్రీలను భార్యలుగా కలిగియుండవచ్చునని అనుమతింపబడిరి. (Mishnah *Sanhedrin* 2.4; *Ketuboth* 10.1-6; *Kerithoth* 3.7.)

[11]John Chrysostom *Homilies on Matthew* 62.1. [12]R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 280. [13]ద్వితీయోపదేశకాండము 24:1–4లో మోషే తెలియజెప్పిన శాసనమునకు మూడు ఉద్దేశములున్నవని మైఖేల్ జే. విల్కిన్స్ చెప్పుచున్నాడు: (1) అసభ్యకరమైన దాని నుండి వివాహ పవిత్రతను కాపాడుట, (2) ఏదో ఒక వెర్రి తలంపునుబట్టి పురుషుడు స్త్రీని విడనాడకుండునట్లు ఆమెను కాపాడుట, మరియు (3) విడాకులు పుచ్చుకొన్న స్త్రీగా, ఆమె ఒక వేశ్యగా లేదా పారిపోయి వచ్చిన వ్యభిచారిణి వలె పరిగణింపబడకుండునట్లు, ఆమె స్థితిని న్యాయసమ్మతమైనదానిగా కాపాడుట. (Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke,* ed. Clinton E. Arnold [Grand Rapids, Mich.: Zondervan, 2002], 118.) [14]"నిమిత్తమే తప్ప" అను ఉపవాచకము సమదృక్పథ సువార్తలలో గల సమానంతర వాక్యభాగములలో అగుపించదు (మార్కు 10:11; లూకా 16:18). [15]సంబంధిత క్రియాపదము *moichaō*, "వ్యభిచారము" ("వ్యభిచరించుట"), 9వ వచనములో కలదు. *Porneia* యొక్క నిర్వచనమును గూర్చిన అదనపు సమాచారము కొరకు చూడు Jack P. Lewis, "An Exegesis of Matthew 19:1-12," *Harding Graduate School of Religion Bulletin* 18 (September 1987): 2. [16]Mishnah *Ketuboth* 3.5; *Sotah* 5.1; *Yebamoth* 2.8. [17]"ఆమె నీవు చెప్పినట్లు చేయునట్లయితే, ఆమెను నీ నుండి వేరుచేయుమని" అపొక్రిఫలోని పుస్తకము సిరాచ్ చెప్పుచున్నది (Sirach 25:26 [NRSV]). "ఒకనికి చెడ్డ భార్య ఉండినట్లయితే, ఆమెకువిడాకులిచ్చుట అదొక ప్రశంసాయోగ్యమైన చర్యయై యుండునని" టాల్మడ్ చెప్పుచున్నది (Talmud *Yebamoth* 63b); "నీవు ఆమెను ద్వేషించినట్లయితే ఆమెను నీవు విడనాడవలెను" (Talmud *Gittin* 90b). ఒక భర్త, పతనమైన తన భార్యకు విడాకులిచ్చునట్లు కొందరు యూదా మతోపదేశకులు అతనిని ఎలా ప్రోత్సాహించారో ఒక ప్రాచీన కథ తెలియజెప్పుచున్నది. పురుషుడు ఆమె కట్నకానుకలను చెల్లింపలేకపోయాడు, గనుక అతడు దానిని చెల్లించి విడాకులిచ్చునట్లు సహాయము చేయుటకు యూదా మతోపదేశకులు డబ్బులు సేకరించి అతనికిచ్చారు. (*Genesis Rabbah* 17.3; *Leviticus Rabbah* 34.14.) [18]Mishnah *Zabim* 2.1; *Yebamoth* 8.4-6; Jerusalem Talmud *Yebamoth* 8.4-6. [19]Ibid. [20]Josephus *Antiquities* 4.8.40; *Against Apion* 2.38.

[21]*The Middle Assyrian Laws* A15, 18, 19. [22]Will Roscoe, "Priests of the Goddess: Gender Transgression in Ancient Religion," *History of Religions* 35 (1996): 195-230. [23]Xenophon *Cyropaedia* 7.5.60-65. [24]"నపుంసకుడు" (KJV) అని అనువదింపబడిన గ్రీకు పదము *saris*, తరుచుగా "అధికారి" అని అనువదింపబడినది (NASB). [25]దీనికి తారతమ్యముగా, ఓరిగెను (c. క్రీ.శ. 185–254) వ్యాఖ్యానమును అక్షరార్థముగా తీసికొని తనను తాను నపుంసకునిగా చేసికొన్నాడు వృషణములను తొలగించుకొన్నాడు. (Eusebius *Ecclesiastical History* 6.8.) [26]వాస్తవమునకు, యూదులలో అధిక సంఖ్యానకులు వివాహమును దేవుడిచ్చిన ఆజ్ఞగా పరిగణించారు (చూడు ఆదికాండము 1:28). (Mishnah *Yebamoth* 6.6.) బ్రహ్మచర్యమును అవలంబించినవారు ప్రధానంగా ఎస్సేనీయుల జాతికి చెందినవారిలో ఉండిరి. (Josephus *Antiquities* 18.1.5; *Wars* 2.8.13; Pliny *Natural History* 5.15.) [27]Glenn T. Stanton, "Divorce," http:/www.focusonthefamily.com/lifechallenges/relationship_challenges/divorce.aspx; accessed 7 June 2010.